అర్హులందరికీ రుణమాఫీ

- గ్రామాల్లో రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాల సర్వే
- వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి
- రైతులు పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

పెద్దేముల్, సెప్టెంబర్ 06 : అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ రుణమాఫీ వర్తిస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కొనసాగుతున్న రైతుల గ్రీవెన్స్‌ను, స్థానిక ఫర్టిలైజర్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. తట్టేపల్లి పీఏసీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ అందని, రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వేను వ్యవసాయాధికారులు ప్రతి గ్రామంలోనూ చేపడుతున్నారని అన్నారు. ఆధార్ సమస్యలు ఉన్న రైతులు బ్యాంక్‌ని సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. తట్టేపల్లి గ్రామంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలను సందర్శించి, తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక వర్షాల వలన పత్తి పంట పసుపు రంగులోకి మారే అవకాశం ఉంటుందని, దీనిని అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా 10 కిలోల పొటాషియం కలిపి వేసుకోవాలన్నారు. ఆయన వెంట తాండూరు ఏడీఏ రుద్రమూర్తి,ఏఈవోలు వినయ్, రజిత, శివరాత్, తట్టేపల్లి పీఏసీఎస్ సీఈఓ రాజ మౌళి, రైతులు, ఇతర అధికారులు ఉన్నారు.

తట్టేపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి తదితరులు

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 6 : వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎస్పీ శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాల వద్ద పోలీసులు బందోబస్తు ఉంటుందని, ఇందుకోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తద్వారా జియో ట్యాగింగ్‌లో మండపాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతులేవన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్ మాట్లాడుతూ.. మున్సిపా లిటీ తరపున మండపాలకు, శోభాయాత్రకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ రాఘవీణ, నాయకులు మాధవరెడ్డి, తస్వర్‌అలీ, రమేశ్‌కుమార్, జాఫర్, శ్రీనివాస్‌గౌడ్, శివరాజ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

ఆర్మీకి అపూర్వ స్వాగతం

- యాచారానికి చేరుకున్న భారత సైన్యం సైకిల్ యాత్ర
- జాతీయ జెండాల ప్రదర్శన

యాచారం, సెప్టెంబర్ 6 : జమ్ముకాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 46 మందితో కూడిన భారత సైన్యం సైకిల్ యాత్ర చేపట్టింది. ఈ యాత్ర శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండల కేంద్రానికి చేరుకోగా స్థానికులు బ్రహ్మరథం పట్టారు. మేజర్లు రవాత్, అభిజిత్ సింగ్, గోవిందరాజుతో పాటు సైనికులకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. వివిధ పార్టీల నాయకులు, యువకులు, విద్యార్థులు సైనికులతో కలిసి యాచారంలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో సైనికులు సమావేశమయ్యారు. పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదవాలని.. జై జైవాన్ జై కిసాన్ నినాదాన్ని నిజం చేయాలని పిలుపునిచ్చారు. దేశ సేవలో పాలుపంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సైనికులు బాగుంటేనే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బాషా, బీజేపీ మండలాధ్యక్షుడు రవి, నాయకుడు రమేశ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు మహ్మద్ ఖాజ, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాచారంలో సైనికులకు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

బాలల ఉత్తమ అవార్డులకు దరఖాస్తులు

షాబాద్, సెప్టెంబర్ 6: రంగారెడ్డి జిల్లాలో వివిధ రంగాల్లో(క్రీడలు, నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, పర్యావరణం, కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ)ప్రతిభ కనబర్చిన బాలలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్(PMRBP)ను అందజేయనున్నారు. ఇందుకోసం అర్హులైన బాలబాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి బి.పద్మజరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం http://awards.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించి ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా దరఖాస్తుల పూర్తి రద్దుకు, మార్పునకు కలెక్టర్‌కి పూర్తి అధికారం ఉంటుందని పేర్కొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం..

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబర్ 6 : ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన వినాయక విగ్రహాలను ఉపయోగించవద్దని, వాటితో పర్యావరణానికి హాని కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన వినాయక విగ్రహాలను ఉపయోగించాలని సూచించారు. మట్టి విగ్రహాలు నీటిలో రెండు, మూడు గంటల్లోనే కరుగుతాయని వాటి వలన పర్యావరణానికి ఎటువంటి నష్టం వాటిల్లదని పేర్కొన్నారు. రసాయన రంగులతో కూడిన పీవోపీతో చేసిన విగ్రహాలు నీటిలో తొందరగా కరగకుండా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలని ఆయన కోరారు.

తాండూరు సబ్ కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్

యాలాల,సెప్టెంబర్ 6: తాండూరు సబ్ కలెక్టర్‌గా ఉమా శంకర్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్డీఓ స్థాయిని సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం మార్పు చేసిన అనంతరం ఇక్కడ ఆర్డీవోగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ రావు స్థానంలో ఉమా శంకర్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాండూరు డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

తల్లీపిల్లల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

- దవాఖానలో మిన్నంటిన బంధువులు, కుటుంబసభ్యుల రోదనలు

తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్న మరో కుమారుడు విఘ్నేశ్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 6 : ఆర్థిక ఇబ్బందులు.. క్షణికావేశానికి ఓ కుటుంబం బలైపోయింది. ఆర్థిక ఇబ్బందులతో గురువారం రాత్రి ఇద్దరు పిల్లలతో తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే గురువారం రాత్రి తల్లి ఉర్సు మంగ, కుమారుడు శరత్ మృతదేహాలను చెరువు నుంచి బయటకు తీశారు. నీట మునిగిన లావణ్య కోసం అర్ధరాత్రి వరకు గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గజ ఈతగాళ్ల సహాయంతో లావణ్య మృతదేహాన్ని బయటకుతీశారు. అనంతరం తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలకు ఇబ్రహీంపట్నం సివిల్ ఆస్పత్రిలో వైద్యులు పోస్టుమార్టం పూర్తిచేశారు. ఈ క్రమంలో దవాఖాన వద్ద కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అనంతరం వైద్య సిబ్బంది మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

ప్రాణాలతో బయటపడిన విఘ్నేశ్

తప్పించుకున్న విఘ్నేశ్..

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగ తన ఇద్దరు కుమారులు శరత్, విఘ్నేశ్, కుమార్తె లావణ్యతో కలిసి ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు వారితో కలిసి ఇబ్రహీంపట్నం చెరువుకు చేరుకుంది. చిన్నకుమారుడు విఘ్నేశ్‌ను చెరువు మెట్లపై కూర్చోబెట్టి శరత్,లావణ్యను నీటిలోకి తోసేసింది. విఘ్నేశ్‌ను కూడా నీటిలోకి తోయడానికి ప్రయత్నించగా.. భయపడిన విఘ్నేశ్ రోడ్డుపైకి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాడు. అనంతరం తల్లి మంగ చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా రోడ్డుపైకి వచ్చిన విఘ్నేశ్ స్థానికులకు తెలుపడంతో ఈ విషయం తెలిసింది. తల్లి మంగ, అన్న శరత్, అక్క లావణ్య మరణించగా విజ్ఞేశ్ మాత్రం ప్రాణాలతో బయటపడి ఒంటరి వాడయ్యాడు.

మరో మారు.. దంచికొట్టిన వాన

- రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- రెండు రోజుల విరామం తర్వాత మళ్లీ కుండపోత
- జిల్లా వ్యాప్తంగా 174.1మి.మీ వర్షపాతం నమోదు
- పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు

రంగారెడ్డి, సెప్టెంబర్ 6(నమస్తే తెలంగాణ) : గత రెండు రోజులుగా మోస్తరుగా కురిసిన వాన శుక్రవారం సాయంత్రం మళ్లీ దంచికొట్టింది. ఇటీవల కురిసిన వర్షాలకు చిగురుటాకుల్లా వణికిపోయిన ప్రజానీకం తేరుకుంటుండగానే.. మరోసారి కుండపోతగా కురవడంతో గజగజలాడారు. సాయంత్రం ఉద్యోగులు, విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొంతసేపు రాకపోకలు స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని 12 మండలాలు మినహా అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు మళ్లీ జలమయమయ్యాయి. ఇప్పటికే కురిసిన వర్షాలకు పల్లెల్లోని రోడ్లు చిత్తడిగా మారగా.. శుక్రవారం వర్షానికి బురదమయం అయ్యాయి. జిల్లాలో ఇంకా సహాయక చర్యలు మొదలు కాక ముందే మరోసారి భారీ వర్షం కురవడంతో అన్నివర్గాల ప్రజల అవస్థలు పడ్డారు.

జిల్లాలో సగటున 6.4మి.మీ.ల వర్షపాతం

శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా 174.1మిల్లీమీటర్ల వర్షం కురవగా.. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 6.4మి.మీ. లుగా నమోదైంది. అత్యధికంగా హయత్‌నగర్‌లో 26.7మి.మీ, గండిపేటలో 26.5, శేరిలింగంపల్లిలో 23.9, రాజేంద్ర నగర్‌లో 18.5, బాలాపూర్‌లో 17.3, సరూర్‌నగర్‌లో 16.8, అబ్దుల్లాపూర్ మెట్‌లో 11.8, మొయినాబాద్‌లో 11.1, ఇబ్రహీంపట్నంలో 8.9, శంకర్‌పల్లిలో 3.9, చేవెళ్లలో 3.3, మంచాలలో 2.9, షాబాద్‌లో 1.6, మహేశ్వరంలో 0.6, కందుకూరులో 0.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

వికారాబాద్, సెప్టెంబర్ 6 : ప్రస్తుతం రాష్ట్ర మంతటా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న వరి, పత్తి పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, తాండూర్ కోఆర్డినేటర్ టి. లక్ష్మణ్, శాస్త్రవేత్త సి. యమున తెలిపారు. శుక్రవారం ధారూరు మండలం రుద్రారం తదితర గ్రామాల్లో నీట మునిగిన పంటలను వారు పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ శాతం వరి పైర్లు దుబ్బు చేసే దశ నుంచి అంకురం, చిరుపొట్ట దశల్లో ఉన్నాయన్నారు. విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా పంటల్లో చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని అన్నారు. వచ్చే నెల రోజులు రైతులు మరింత అప్రమత్తంగా ఉండి చీడపీడలను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని రైతులకు సూచించారు. మొక్కల వేరులకు గాలి తగిలేట్లు చూసుకోవాలని సూచించారు.

పత్తి పంటను పరిశీలించిన తాండూరు కోఆర్డినేటర్ టి. లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున

వరద బాధితులను ఆదుకోవాలి

- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్

మొయినాబాద్, సెప్టెంబర్ 6: భారీ వర్షాలు, వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో జన జీవనం స్తంభించిందని అన్నారు. ఇండ్లల్లోకి వరద నీరు చేరడంతో కట్టుబట్టలతో బయటకు వెళ్లి ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలను వర్షాలు వణికిస్తున్నాయని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంతో పాటు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ వరద బాధితులకు ఆహారం, నీరు, ఇతర నిత్యావసరాలను అందజేసి మానవత్వం చాటాలని పేర్కొన్నారు.

డెంగీ, డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

- రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి, సెప్టెంబరు 6(నమస్తే తెలంగాణ) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండడంతోపాటు కొత్త నీరు ప్రవహించడం వల్ల డయేరియా, డెంగీ ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం దుబ్చర్ల, లేమూరు, రాచలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో సందర్శించి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఫీవర్ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని, వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. డీఎంహెచ్‌వో వెంట పీహెచ్ సీల వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

- జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

శంకర్‌పల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 6 : సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలంతా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలో ఫ్రై డే– డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపాలిటీలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో మున్సిపల్ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ బి.వెంకటరామిరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు వాణీప్రకాశ్, మేనేజర్ అంజన్‌కుమార్, ఏఈ సాయి కిశోర్, మెడికల్ ఆఫీసర్ రేవతిరెడ్డి, ప్రశాంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలపై సమీక్ష

చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం రాష్ట్ర నాయకులు, చిత్రంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

అలుగు పారుతున్న మెట్లకుంట చెరువు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 6 : మండలంలోని మెట్లకుంట ఎల్లమ్మ చెరువు వరద నీటితో నిండి అలుగు పారుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నిండటంతో వాటి నుంచి వచ్చే వరద మెట్లకుంట చెరువులోకి వచ్చి చేరుతున్నది. శుక్రవారం చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నది. ఆ నీరంతా ఎల్లమ్మ వాడుక ద్వారా బొంరాస్‌పేట పెద్ద చెరువులోకి చేరుతున్నది. ఏర్పుమల్ల కాకర వాణి ప్రాజెక్టు, మెట్లకుంట చెరువుల ద్వారా వరద నీరు బొంరాస్‌పేట పెద్ద చెరువులోకి నీరు భారీగా చేరుతున్నది. మండలంలో ఇప్పటికే మూడు చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. దాంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి

యాలాల,సెప్టెంబర్6: నీటి సంపులో పడి బాలుడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని దౌలాపూర్‌లో జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్షాల కారణంగా దౌలాపూర్‌కు చెందిన మల్లమ్మ, వెంకటయ్య దంపతుల ఇల్లు కూలిపోయింది. దాంతో గ్రామ కార్యదర్శి పంచాయతీ భవనం పైన హాలులో ఉండడానికి అనుమతి ఇచ్చారు. హాలును శుభ్రం చేసే పనిలో దంపతులు నిమగ్నమై ఉండగా 5వ తరగతి చదువుతున్న వారి కుమారుడు శివకుమార్ పంచాయతీ భవనం ముందున్న సంపులో నుంచి నీటిని తీసుకువచ్చే క్రమంలో అందులో పడిపోయాడు. గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేసి బాలుడిని సంపులో నుంచి బయటకు తీసేసరికి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కళ్ల ముందే కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ బాలుడి తల్లిదండ్రుల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. మండల పీఏసీఎస్ వైస్ చెర్మన్ వడ్డె రాములు ఆ దంపతులను ఓదార్చారు. ప్రభుత్వం వారికి ఆర్థికంగా చేయూత నందించాలని కోరారు.

మద్యం కోసం యువకుడి హత్య.. ఇద్దరి అరెస్టు

- చోరీ చేసిన మద్యం పంపకాల్లో తేడాలు రావడంతో దారుణానికి ఒడిగట్టిన నిందితులు
- పర్సులో లభించిన ఆధారాలతో హత్య, చోరీ కేసులను ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

పెద్దేముల్/తాండూరు రూరల్, సెప్టెంబర్ 06 : కల్లు దుకాణంలో చోరీ చేసిన మందు బాటిళ్ల పంపకాల్లో తేడాలు రావడంతో యువకుడిని దారుణంగా హతమార్చారు. గత నెల 31న గోపాల్‌పూర్ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన బండమీది రమేశ్(32) హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం కరణ్‌కోట్ సర్కిల్ కార్యాలయంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండమీది నరేశ్ సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదేవిధంగా బంట్వారం మండలం సల్బతాపూర్ గ్రామానికి చెందిన గంగనపల్లి శ్రీకాంత్ వరుసకు అల్లుడైన నరేశ్ వద్దకు పనికోసం వెళ్లాడు. అక్కడ ఏలాంటి పని లభించకపోవడంతో ఆగస్టు 29న నరేశ్, శ్రీకాంత్ ఇద్దరు కలిసి సల్బతాపూర్‌కు చేరుకున్నారు. అదేరోజు రాత్రి గ్రామంలోని శ్రీకాంత్ ఇంటి పక్కనే పార్క్ చేసిన బ్రెజ్జా కారులో డబ్బుల కోసం అద్దాలు పగులగొట్టారు. డబ్బులు లభించకపోవడంతో కారులో ఉన్న కెమెరాను అపహరించుకుపోయారు. దీనిపై బాధితుడు బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉంటే ఆగష్టు 30న శ్రీకాంత్, నరేశ్ ఇద్దరూ బైక్‌పై తాండూరు వెళ్లగా అక్కడ వారి దాయాదైన గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన బండమీది రమేశ్ కనిపించాడు. ముగ్గురు కలిసి రాత్రి 9.30 గంటల ప్రాంతంలో పెద్దేముల్‌కు వచ్చి మందు తాగాలని నిర్ణయించుకున్నారు. డబ్బులు లేకపోవడంతో పెద్దేముల్ తండా మార్గంలో ఉన్న కల్లు దుకాణంలో చొరబడి 13 లిక్కర్ బాటిళ్లను దొంగిలించారు.

చోరీ విషయం బయట చెప్తాడనే భయంతో రమేశ్ హత్య

మద్యం చోరీ చేసి గోపాల్‌పూర్ శివారులోని ధర్మిచెట్టు సమీపంలో ముగ్గురూ మూడు మద్యం బాటిళ్లు తాగారు. మిగిలిన 10 బాటిళ్లను పంచుకుందామని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్, నరేశ్ సమానంగా పంచుకుందామని చెప్పగా రమేశ్ తనకు ఎక్కువ బాటిళ్లు కావాలని డిమాండ్ చేశాడు. ఎక్కువ ఇవ్వకపోతే చోరీ విషయాన్ని బయట చెప్తానని బెదిరించాడు. దాంతో విషయం బయటపడుతుందని భావించిన శ్రీకాంత్, నరేశ్ కలిసి రమేశ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. రమేశ్‌ను కిందపడేసి గొంతు నులిమారు. అరవకుండా ఉండేందుకు శ్రీకాంత్ నోరు మూయగా నరేశ్ తన బెల్టు తీసి రమేశ్ మెడకు చుట్టి లాగారు. ఊపిరాడక రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో శవాన్ని పక్కనే ఓ సుద్ద గుంతలో పడేసి వెళ్లిపోయారు.

ఘటనా స్థలంలో దొరికిన పర్సు..

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులకు సంఘటనా స్థలంలో శ్రీకాంత్ పర్సు దొరికింది. అంతేకాకుండా హతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశారు. పర్సులో లభించిన ఆధారాలతో పోలీసులు సల్బత్తాపూర్‌కు చెందిన గంగనపల్లి శ్రీకాంత్‌ను తమదైన శైలిలో విచారించారు. శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు బండమీది నరేశ్‌ను సైతం విచారించగా తామే హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. దీంతో కల్లు దుకాణంలో చోరీ, రమేశ్ హత్య చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట తాండూరు రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ గిరి, పోలీసులు ఉన్నారు.

నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్